@netifocusnews @focustv
http://epaper.netifocusnews.com
www.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || బుధవారం 07, ఆగస్ట్ 2024 || పేజీలు: 04

## తెలంగాణలో రెండు రోజులు

# భారీ వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి




హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

తెలంగాణలో రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రానున్న మూడు రోజుల్లో స్థిరమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో పలుచోట్ల వీచే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, నాగర్ మిగతా 2లో..

## అమెరికాలో బిజీబిజీగా

# సిఎం రేవంత్

- పలు కంపెనీలతో చర్చలు..ఒప్పందాలు
- తెలంగాణలో ఆర్సీసియం కంపెనీ కార్యకలాపాలు
- ప్రతినిధులతో అధికారుల ఒప్పందం



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

టెక్నాలజీ, సర్వీస్ సొల్యూషన్స్‌లో పేరొందిన ఆర్సీసియం కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించనుంది. మిగతా 2లో..



## 15న మూడో విడత

# రుణమాఫీ

- ఖమ్మం జిల్లా వైరా సభలో 2 లక్షలు మాఫీ చేయనున్న సీఎం
- రేషన్ కార్డు లేనివారికి.. పాస్‌బుక్‌తో కుటుంబం నిర్ధారణ
- మాఫీపై తప్పుడు ప్రచారం బీఆర్ఎస్, బీజేపీకి తగదు: తుమ్మల
- ఖమ్మం జిల్లా వైరా సభలో 2 లక్షలు మాఫీ చేయనున్న సీఎం
- అక్షర దోషాలు, ఆధార్, బ్యాంకర్ల తప్పిదాలు, ఎర్రర్లున్నా సరిచేసి మాఫీ
- మాఫీపై తప్పుడు ప్రచారం బీఆర్ఎస్, బీజేపీకి తగదు: మంత్రి తుమ్మల



హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

స్వాతంత్ర దినోత్సవాన.. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేసే సందర్భాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ చేతుల మీదుగా మూడో విడత రుణ మాఫీ చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించే బహిరంగ సభ దీనికి వేదిక కానుందన్నారు. రెండు విడతల్లో లక్షన్నర వరకు మాఫీ చేశామని, ఈసారి సున్నా నుంచి రూ.2లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. మిగతా 2లో..



## రూ. 1,000 కోట్లతో

# స్వచ్ఛ బయోప్లాంట్

### తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ విదేశీ పర్యటన..

- హైదరాబాద్‌లో నెలకొల్పనున్న సంస్థ
- సీఈవోతో సీఎం రేవంత్ బృందం చర్చలు
- మూడేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగం..
- ఆర్సీసీఎం విస్తరణతో 500 నియామకాలు
- అమెరికా పర్యటనలో రేవంత్ ఒప్పందాలు..

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

తెలంగాణకు పెట్టుబడులు సాధించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతంగా సాగుతోంది. మంగళవారం న్యూయార్క్ పర్యటనలో భాగంగా పలు అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. కాగా, బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ 'స్వచ్ఛ బయో' తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధపడింది. త్వరలో రాష్ట్రంలో సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్‌ను నెలకొల్పనుంది. మొదటి మిగతా 2లో..





## హైదరాబాద్ మహా నగరానికి

# మల్లన్న సాగర్ నీళ్లు

- ప్రాజెక్టు నుంచి 15 టీఎంసీలు తెచ్చేలా ప్లాన్
- హైదరాబాద్‌లో తాగునీటికి10 టీఎంసీలు
- ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తో పాటు మూసీ నది ప్రక్షాళనకు 5 టీఎంసీలు
- ప్రాజెక్టుకు 5,560 కోట్లు కేటాయిస్తూ జీవో
- రెండేళ్లలో పూర్తి చేయాలని సర్కారు లక్ష్యం



### రుణమాఫీ అందని వారు

## ఫిర్యాదు చేయొచ్చు

- ఆగస్ట్ 15 కల్లా రెండు లక్షల రుణం మాఫీ
- బిఆర్ఎస్ రాజకీయ విమర్శలను పట్టించుకోం
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

➢ వివరాలు 02లో..

## ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం



### మాది చేతల ప్రభుత్వం: మంత్రి ఉత్తమ్

సూర్యాపేట, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తమదేనని అన్నారు. రైతురుణమాఫీ ఓ పెద్ద నిర్ణయమని అన్నారు. గతంలో బిఆర్ఎస్ దీనిని అమలు చేయలేక చతికిల పడిందన్నారు. సూర్యాపేట జిల్లాలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటించారు. హుజూర్ నగర్‌లో 2వేల 160డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. మాది మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం అన్న మంత్రి నియోజకర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఐటీఐ కాలేజీ నిర్మాణానికి భూమి పూజ చేసిన తరువాత ఆయన క్యాంప్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి.. షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. హుజూర్ నగర్ లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం పరిశీలనలో ఉందని తెలిపారు. 2009లో ఆయన గృహనిర్మాణ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నియోజవర్గంలో హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసి 2 వేల 160 ఇళ్ల నిర్మాణ పనులను 70 శాతం పూర్తి చేశామన్నారు. మిగతా 2లో..

# రూ.1000కోట్లతో స్వచ్ఛ బయోప్లాంట్

(మొదటి పేజీ తరువాయి..)

దశలో రూ.1000 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మించి, 250 మందికి ప్రత్యక్షంగా, మరో 250 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు తెలంగాణ అధికార ప్రతినిధి బృందంతో.. స్వచ్ఛ్ బయో చైర్‌పర్సన్ ప్రవీణ్ పరిపాటి మంగళవారం చర్చలు జరిపారు. స్వచ్ఛ్ బయోలో అంతర్జాతీయ భాగస్వామిగా ఉన్న సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీ.. బయోమాస్, సెల్యులోజ్ నుంచి జీవ ఇంధనాలు, జీవ రసాయనాలు ఉత్పత్తి చేసే పేటెంట్ పొందడంతోపాటు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ కంపెనీ పెట్టుబడులు రాష్ట్రంలో సుస్థిర, పర్యావరణ అనుకూల వృద్ధికి దోహదపడే అవకాశాలున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తరపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రవీణ్ పరిపాటి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ వికేంద్రీకృత అభివృద్ధి, దృక్పథం తమను ఆకట్టుకుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములం కావడం తమకు సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ టెక్నాలజీ కంపెనీ ట్రైజిన్.. హైదరాబాద్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్‌ను నెలకొల్పనుంది. డేటా అనలిటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే సొల్యూషన్లను అందించే ఈ కంపెనీ.. ఆరు నెలల్లో తన కార్యకలాపాలు ప్రారంభించనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా ట్రైజిన్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమై ఇందుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కంపెనీ కార్యకలాపాలు ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో వంద మంది పని చేస్తున్నారు. తాజా చర్చల అనంతరం కార్యకలాపాలను మరింత విస్తరించాలని కంపెనీ నిర్ణయించింది. ఇందులో భాగంగా రానున్న మూడేళ్ల కాలంలో వెయ్యి మంది ఉద్యోగులను నియమించుకొని శిక్షణ ఇవ్వనుంది. కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా రెండున్నర వేల మంది పని చేస్తున్నారు. ఇందులో వెయ్యి మంది భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 160 మిలియన్ డాలర్ల ఆదాయం కలిగి ఉన్న ట్రైజిన్ విస్తరణతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో హైదరాబాద్ మరింత పురోగతి సాధిస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ప్రకటనలో పేర్కొంది. ఐక్యరాజ్య సమితితోపాటు దాని అనుబంధ విభాగాలకు ఈ కంపెనీ రెండు దశాబ్దాలకు పైగా సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

**ఆర్సీసీఎం విస్తరణతో కొత్త ఉద్యోగాలు..**

టెక్నాలజీ, సర్వీసెస్ సొల్యూషన్స్‌లో పేరు పొందిన అమెరికన్ కంపెనీ ఆర్సీసీఎం తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించనుంది. రానున్న రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను నియమించి కార్యకలాపాలు కొనసాగించనుంది. అమెరికా తర్వాత విదేశీ గడ్డపై తొలిసారిగా కంపెనీ విభాగాన్ని తెలంగాణలోనే స్థాపించనుండడం గమనార్హం. ఈ మేరకు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శ్రీధర్ బాబు.. ఆర్సీసీఎం సీఈవో గౌరవ్ సూరితో చర్చలు జరిపి అధికారుల సమక్షంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీ రంగంలో బహుముఖ వృద్ధిని సా౨ధించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ క్రమంలో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ఆర్సీసీఎం రాకతో హైదరాబాద్.. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్ రంగంలో సరికొత్త ఆవిష్కరణ కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని తెలిపారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. తెలంగాణ అంటేనే వ్యాపారం.. తెలంగాణ అంటేనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తామని ప్రకటించారు. న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న చైర్‌పర్సన్‌లు, సీఈవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల గురించి వివరించారు. త్వరలోనే హైదరాబాద్‌లో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. దేశంలోనే జీరో కార్బన్ సిటీ ఇక్కడ ఏర్పడతుందన్నారు. ఫ్యూచర్ సిటీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌తోపాటు మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా విలేజ్‌లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ ఫ్యూచర్ సిటీ.. రాష్ట్ర అభివృద్ధితోపాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌తోపాటు తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలు, తెలంగాణ చరిత్రపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు.



## హైదరాబాద్ మహా నగరానికి
# మల్లన్న సాగర్ నీళ్లు

- ప్రాజెక్టు నుంచి 15 టీఎంసీలు తెచ్చేలా ప్లాన్
- హైదరాబాద్‌లో తాగునీటికి10 టీఎంసీలు
- ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తో పాటు మూసీ నది ప్రక్షాళనకు 5 టీఎంసీలు
- ప్రాజెక్టుకు 5,560 కోట్లు కేటాయిస్తూ జీవో
- రెండేళ్లలో పూర్తి చేయాలని సర్కారు లక్ష్యం

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

హైదరాబాద్ మహా నగరానికి భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించే పనులకు సర్కారు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే నగరంలో తాగునీటి అవసరాల కోసం గోదావరి మొదటి దశ ద్వారా 163 ఎంజీడీల(మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీరు సరఫరా చేస్తుండగా.. ఇప్పుడు రెండో దశ నీటిని తరలించేందుకు సన్నద్ధమవుతోంది. ఇందు కోసం రూ.5,560 కోట్లను కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ పథకం కింద 15 టీఎంసీల నీటిని తరలించనున్నారు. దీని ద్వారా నగరానికి తాగునీటిని తరలించడంతోపాటు మూసీ నది మీద నిర్మించిన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలను పునరుజ్జీవింప చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వరకు వాటర్‌బోర్డు భరిస్తుండగా.. 60శాతం నిర్మాణ సంస్థ భరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**2030 అవసరాలను దృష్టిలో పెట్టుకుని..**

ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వివిధ జలాశయాల నుంచి 580-600 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. 2030 అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 170 ఎంజీడీల నీటిని తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నుంచి 30 టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉండటంతో అదనపు జలాల కోసం రెండోదశ పనులు చేపట్టాలని నిర్ణయించింది. 2030 వరకు హైదరాబాద్ తాగునీటి అవసరాలు 750 ఎంజీడీలకు పెరుగుతాయని సర్కారు అంచనా వేసింది. 2050 నాటికి ఇది 1014 ఎంజీడీలకు చేరుతుందని, అందులో భాగంగానే మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీటిని తరలించే ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అధికార వర్గాలు తెలిపాయి.

**మల్లన్నసాగర్ నుంచి తరలింపు ఇలా..**

గోదావరి తొలి దశ ప్రాజెక్టు కింద నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలికి ఇప్పటికే ఏటా 10 టీఎంసీల నీరు తరలిస్తున్నారు. తాజాగా రెండో దశ పనుల ద్వారా 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్న సాగర్ నుంచి ఏటా 15 టీఎంసీల నీటిని తరలించనున్నారు. ఇందులో 10 టీఎంసీలు తాగునీటి అవసరాలకు.. మిగిలిన 5 టీఎంసీలు జంట జలాశయాల పునరుజ్జీవం, మూసీ ప్రక్షాళన కోసం వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వ్యాప్కోస్ సంస్థ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా మల్లన్న సాగర్ నుంచి శామీర్‌పేట వద్ద గల ఘన్‌పూర్ వరకు 3,600 ఎంఎం వ్యాసం కలిగిన భారీ పైపులైన్ నిర్మించనున్నారు. అక్కడి నుంచి జంట జలాశయాలకు చేరేవిధంగా ఓ పైపులైన్.. నగర తాగునీటి అవసరాల కోసం మరో పైపులైన్ నిర్మిస్తారు. ఘన్‌పూర్‌లో 780 ఎంఎల్‌డీల నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. అక్కడి నుంచి 2400 ఎంఎం వ్యాసం కలిగిన పైపులైన్ ద్వారా 10 టీఎంసీలను నగరానికి తరలించనున్నారు. గోదావరి జలాలను ఫేజ్-1 కింద ఇప్పటికే ఘన్‌పూర్ నుంచి మూడు రింగ్ మెయిన్ పైపులైన్లు ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు అందిస్తున్నారు. ఒక రింగ్ మెయిన్ బిట్స్ పిలానీ మీదుగా సైనిక్‌పూరి ప్రాంతానికి గోదావరి జలాలను తరలిస్తుండగా.. రెండో రింగ్ మెయిన్ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి మీదుగా లింగంపల్లికి.. మూడో రింగ్ మెయిన్ నుంచి ఔటర్ వెంట పటాన్‌చెరు మీదుగా కోకాపేట ప్రాంతానికి గోదావరి జలాలను తరలిస్తున్నాయి. అయితే ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా ఘన్‌పూర్ నుంచి నాలుగో రింగ్ మెయిన్ పైపులైన్‌ను 40 కి.మీ. మేర ముత్తంగి వరకు వేయనున్నారు. దీనిని ఇప్పటికే ఉన్న రింగ్ మెయిన్లకు అనుసంధానం చేస్తారు. దీంతో కోకాపేట, కొల్లూరు, ఐటీ కారిడార్ ప్రాంతానికి నేరుగా గోదావరి జలాలు అందనున్నాయి. ఘన్‌పూర్ నుంచి 2200ఎంఎం వ్యాసం కలిగిన పైపులైన్‌ను ఔటర్ అవతలి భాగం నుంచి ముత్తంగి, కొల్లూరు, ఇంద్రారెడ్డి కాలనీ, జన్వాడ మీదుగా జన్వాడ-ఖానాపూర్ మధ్యలో నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు నిర్మిస్తారు. ఈ పైప్‌లైన్ దాదాపు 58కి.మీ. మేర ఉంటుంది. ఉస్మాన్‌సాగర్‌లో గోదావరి జలాలు పూర్తిస్థాయిలో నిండిన తర్వాత హిమాయత్ సాగర్‌లోకి వెళ్లేందుకు చర్యలు తీసుకుంటారు. జంట జలాశయాలు నిండిన తర్వాత మూసీ నదిలోకి నీటిని వదులుతారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఉస్మాన్‌సాగర్ దిగువన 120ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే), హిమాయత్‌సాగర్ దిగువన 70ఎంఎల్‌డీల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించనున్నారు.

## నగర తాగునీటికి గోదావరి
# రెండోదశకు అనుమతి
### రెండోదశ పనులకు ప్రభుత్వం రూ.5,560 కోట్లు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

హైదరాబాద్ మహానగర తాగునీటి అవసరాలను మెరుగుపరిచేందుకు గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-2కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ మంగళవారం జీవో జారీ చేసింది. రెండో దశ పనులకు ప్రభుత్వం రూ.5,560 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టులో నగరానికి అదనపు జలాలను తరలించడంతో పాటు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను సైతం నింపనున్నది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ విధానంలో పనులు పూర్తి చేయనుంది. ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాలకు అన్ని సోర్సుల నుంచి 580 ఎంజీడీల నుంచి 600 ఎంజీడీల నీరు సరఫరా అవుతున్నది. 2030 నాటికి నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని 170 ఎంజీడీల అదనపు జలాల్ని సరఫరా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందు కోసం గోదావరి నుంచే 30 టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉన్నది. 2030 నాటికి హైదరాబాద్ నగర తాగునీటి డిమాండ్ 750 ఎంజీడీలకు పెరుగుతుందని అంచనా. 2050 నాటికి 1014 ఎంజీడీలుగా ఉండబోతున్నది. ఫేజ్-1 కింద నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తున్నది. తాజాగా పథకం రెండో దశ ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 15 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 15 టీఎంసీల్లో 10 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా.. మూసీ ప్రక్షాళనలో భాగంగా జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వాప్కోస్ కంపెనీ సిద్ధం చేసింది. ఇందులో పంప్‌హౌస్‌లు, సబ్‌స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్‌పూర్ వరకు 3600 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. అంతే కాకుండా ఘన్‌పూర్, శామీర్‌పేట వద్ద 780 ఎంఎల్‌డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మిస్తారు. ఘన్‌పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు.. ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

## ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం..

(మొదటి పేజీ తరువాయి..)

తరువాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వ మిగిలిన వర్క్ పూర్తి చేస్తామని చెప్పి పేదలను అన్యాయం చేసిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్? ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతరువాత రూ. 75 కోట్ల రూపాయిలతో హౌసింగ్? కాలనీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. 2025 జనవరి నాటిని ఇండ్ల నిర్మాణం పూర్తిచేసి పేదలకు ఇస్తామన్నారు.

## 15న మూడో విడత
# రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి..)

సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఇతర అనుబంధ శాఖలపై సమీక్ష అనంతరం విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు. రెండు విడతలమాఫీలో 30వేల ఖాతాలకు సాంకేతిక ఇబ్బందులు వచ్చాయి. కొన్ని బ్యాంకు లు పొరపాటున కొన్ని ఖాతాల వివరాలు పంపలేదు. ఐదేళ్ల నుంచి రుణాలు తీసుకున్న రైతుల వివరాలు ఇవ్వాలని 32 బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత ప్రభుత్వ మాఫీ చేసిన ఖాతాలతో పాటు కొన్ని కుడి ఎడమగా అవే 40 లక్షల ఖాతాలు పంపించారు. బ్యాంకర్ల డేటా ప్రకారం 25-26 లక్షల రైతుకు టుంబాలను రుణ విముక్తులను చేస్తున్నాం. బ్యాంకర్ల తప్పిదాలున్నా, ఆధార్ ఎర్రర్లు ఉన్నా, అక్షర దోషాలున్నా అన్నీ సవరిస్తా'మని తెలిపారు. అప్పులున్న ఖాతాలు, తీర్చిన ఖాతాలు, తీర్చని ఖాతాల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, వాటితో ఏఈవోలు, ఏవోలు రైతుల వద్దకు వెళ్లి ఎర్రర్లు సరిచేసి మాఫీ చేస్తారని ప్రకటించారు. రేషన్ కార్డు లేకపోయినా పాస్‌బుక్ ద్వారా కుటుంబ నిర్ధారణ చేసి రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని తెలిపారు. తొలి విడతలో 17 వేల ఖాతాలు ఎర్రర్ వచ్చాయని, వాటిలో 10 వేల ఖాతాలను సరిచేశామని, రూ.84 కోట్లు తిరిగి రాగా రూ.44 కోట్లు ఇచ్చేశామని, మిగతావీ ఖాతాలు సరిచేసి ఇస్తామని చెప్పారు. 2లక్షల వరకు మాఫీ పూర్తయిన తర్వాత మిగిలిన రైతులకు మాఫీ చేసే బాధ్యతను వ్యవసాయ శాఖ తీసుకుంటుందని వివరించారు. మాఫీ ఎందుకు కాలేదో కారణాలు సహా.. శాఖ వద్ద ఉన్న యాప్‌లో రైతుల వివరాలన్నీ ఉన్నాయని, 15 తర్వాత వాటిని సరిచేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిన పంటల బీమా పథకానికి ఈ ఖరీఫలోనే టెండర్లు పూర్తిచేసి, రైతులకు పైసా ప్రీమియం భారం లేకుండా అమలు చేస్తామన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కౌలు రైతుల విషయంలో కూడా స్పష్టత రావాల్సి ఉన్నదని చెప్పారు.

## తెలంగాణ జనం కోసం తపించిన గద్దర్: సిఎం రేవంత్

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి సందర్భంగా గద్దర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులులర్పించారు. ఆయన చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా… పోరు తెలంగాణమా అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువుపట్టుగా నిలిచిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్ ఉన్నత కొలువుల వైపు దృష్టి సారించకుండా ప్రతి ఒక్కరికి కూడు, గూడు, నీడ లభించాలనే లక్ష్యంతో జీవితాంత తన పాటలతో ప్రజలను చైతన్యపర్చారని పేర్కొన్నారు. తెలంగాణ జన సమితి, తెలంగాణ జన సభతో పాటు పలు ఉద్యమ సంస్థల ఏర్పాటుతో తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరులూదిన వారిలో అగ్రగణ్యుడు గద్దర్ అని గుర్తు చేశారు. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని, ఆయన చేసిన సాంస్కృతిక, సాహితీ సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందని తెలిపారు. గద్దర్‌తో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

## తెలంగాణలో 2రోజులు
# భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి..)

కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బుధవారం నుంచి గురువారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగా, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. హైదరాబాద్‌లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుంది.. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో నిజామాబాద్, వనపర్తి, మెదక్, నల్గొండ, వరంగల్, సిద్దిపేట, మహబూబాబాద్, కొత్తగూడెంతో పాటు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా కొణిజెర్లలో 148 మిల్లీమిటర్లు, తల్లాడలో 120 మిల్లీమిటర్ల వర్షాపాతం నమోదైందని టీజీడీపీఎస్ పేర్కొంది.

## రుణమాఫీ అందని వారు
# ఫిర్యాదు చేయొచ్చు

హైదరాబాద్, (నేటి ఫోకస్‌న్యూస్)-ఆగస్ట్ 06:

గతంలో రుణమాఫీ సరిగా జరగలేదన్న భావన రైతుల్లో ఉందని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఓఆర్ఆర్‌ను రూ.7 వేల కోట్లకు అమ్మి రుణమాఫీ చేయాలని గత ప్రభుత్వం ఆలోచించిందని విమర్శించారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు సరైన పద్ధతిలో రుణమాఫీ చేయకపోయినప్పటికీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రం విమర్శిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ద్వారా రాజకీయ లబ్ది పొందలేరని వ్యాఖ్యానించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తోంది. ఎన్ని కష్టాలున్నా ఈ అంశంలో ముందుకెళ్తున్నాం. ప్రతిపక్ష నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నాం. మూడు విడతల్లో ఈ పక్రియ కొనసాగుతోంది. పాస్‌బుక్ లేకపోయినా.. తెల్లకార్డు ద్వారా రుణమాఫీ చేస్తున్నాం. రుణాలు మాఫీ కాకపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సాంకేతిక కారణాల వల్ల 30 వేల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. పొరపాట్లు సరిచేసి అర్హులందర్నీ రుణ విముక్తుల్ని చేస్తాం. ఆగస్టు 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ కార్యక్రమాన్ని వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు. రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కొనసాగుతోందని తుమ్మల వెల్లడించారు. రుణమాఫీ రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. ఆగస్టు 14న లక్షన్నర నుంచి 2 లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. 2 లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇంత వరకు ఏ రాష్ట్రం పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్న అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. రుణమాఫీ కానీ రైతులు అధికారులకు ఫిర్యాదు చేయొచ్చని చెప్పారు. రుణమాఫీ కానీ రైతులు వివరాలు ఇవ్వాలని సూచించారు. రుణమాఫీలో టెక్నికల్ ఇష్యూ ఉంటే క్లియర్ చేస్తామని చెప్పారు.కేంద్రప్రభుత్వం కూడా రైతుల్నిపట్టించు కోలేదన్నారు తుమ్మల. రైతు చట్టాలతో కేంద్రం ఇబ్బంది పెట్టిందన్నారు. కేంద్ర బ్జడెట్ లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. రైతుల పేరు మీద బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామాలు ఆడుతోందని విమర్శించారు తుమ్మల. రుణమాఫీపై కూడా కొందరు రాజకీయం చేస్తున్నారని అన్నారు. అన్ని వ్యవస్థలను బీఆర్ఎస్ సర్వనాశనం చేసిందన్నారు. 2022లో ఎన్నికల ముందు భూములు అమ్మి రుణమాఫీ చేశారని చెప్పారు. గత సర్కార్ రుణమాఫీ పేరుతో రైతుల్ని ముంచిందన్నారు తుమ్మల. రైతు బీమా స్కీంను కంటిన్యూ చేస్తామని చెప్పారు. బీఆర్ఎస్ పనికి మాలిన రాజకీయాలు బంద్ చేసుకోవాలని సూచించారు తుమ్మల.

## అమెరికాలో బిజీబిజీగా
# సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి..)

ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అమెరికా పర్యటనలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబుతో పాటు అధికారుల బృందం ఆర్సీసియం సీఈవో గౌరవ్ సూరి నేతృత్వంలో కంపెనీ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆర్సీసియం మొదటిసారిగా హైదరాబాద్‌లో తమ ఆఫీసును విస్తరించనుంది. ఆర్సీసియం లాంటి కంపెనీలకు తగినంత మద్దతు పాటు మౌలిక సదుపాయాలను అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఐటీ మంత్రి శ్రీధర్? బాబు చెప్పారు. ప్రపంచ స్థాయి టెక్ కంపెనీలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారుతుందని అన్నారు. మౌలిక సదుపాయాలతో పాటు నైపుణ్యమున్న మానవ వనరులుండటంతో.. హైదరాబాద్‌ను తమ అంతర్జాతీయ కార్యకలాపాలకు అనువైన ప్రదేశంగా ఎంచుకున్నట్లు కంపెనీ సీఈవో గౌరవ్ సూరీ తెలిపారు. ఐటీ రంగంలో బహుముఖ వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్య మిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంపెనీ ప్రతినిధులతో జరిగిన చర్చల్లో స్పష్టం చేశారు. కంపెనీ విస్తరణకు ప్రభుత్వం తప్పకుండా సహకరిస్తుందని ప్రకటించారు. ఈ కంపెనీ విస్తరణ బ్యాంకిగ్గ్÷నాన్సియల్ సర్వీసెస్ అండ్ ఇన్సురెన్స్ రంగంలో హైదరాబాద్ పే కొత్త ఆవిష్కరణ కేంద్రంగా నిలబెడుతుందని అన్నారు. సాంకేతిక వృద్ధికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య సహకారం తప్పనిసరిగా ఉండాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. బ్యాంకులు, హెడ్జ్ ఫండ్‌లు, సంస్థాగత ఆస్తుల నిర్వాహకులు, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలకు సంబంధించిన డేటాతో పాటు కార్యకలాపాలపై ఈ కంపెనీ విశ్లేషణలు అందిస్తుంది. ప్రత్యేకంగా డేటా మేనేజ్మెంట్, డేటా స్ట్రాటజీలో ఈ కంపెనీకి గుర్తింపు ఉంది. హైదరాబాద్ ఆఫీసు విస్తరణతో రాష్ట్రంలో మరింత మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. గ్లోబల్ టెక్ కంపెనీలకు ప్రధాన గమ్య స్థానంగా హైదరాబాద్ అందరి దృష్టిని ఆకర్షించనుంది. అమెరికా తర్వాత విదేశాల్లో కంపెనీ పెట్టడం ఇదే మొదటి సారి. ప్రపంచ వ్యాప్తంగా తమ సేవల విస్తరణకు హైదరాబాద్ సెంటర్ కీలకంగా నిలుస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నిపుణులను కంపెనీ నియమించుకోనుంది. డీఈ షా గ్రూప్, బ్లాక్‌స్టోన్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ మద్దతుతో ఆర్సీసియం స్వతంత్ర సంస్థగా ప్రారంభమైంది.





# ఆదర్శనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్..

- రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను చాటిన మహనీయుడు
- ఆయన అడుగుజాడలల్లో నడవాలి..
- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు

మిర్యాలగూడ, (నేటి ఫోకస్ న్యూస్)-ఆగస్టు 06:

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణము రెడ్డి కాలనీ బి.అర్.యస్ పార్టీ కార్యాలయంలో మరో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహ రెడ్డి తో కలిసి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జయశంకర్ సార్ విగ్రహం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమములో డీ.సీ.ఎం.స్ నల్లగొండ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణ రెడ్డి, మాజీ జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షులు చింతారెడ్డి శ్రీనివాస రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు యడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రంగా రెడ్డి, మాజీ జిల్లా కో-ఆప్షన్ మెంబర్ ఎం.డి. మోషీన్ అలీ, మండలాల పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ ఏర్పాటుకై జీవితమంతా పోరాడిన మహెూన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్

- తొర్రూరు డిప్యూటీ తహసిల్దార్ ఉప్పుల నర్సయ్య
- తహసిల్దార్ కార్యాలయంలో తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుక

తొర్రూరు, (నేటి ఫోకస్ న్యూస్)-ఆగస్టు 06:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తన జీవితమంతా పోరాడిన మహెూన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని తొర్రూరు డిప్యూ టీ తహసిల్దార్ నర్సయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డిప్యూటీ తహసిల్దార్ పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆరు దశాబ్దాలకు పైగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై తన జీవితాన్ని దారపోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరుగే కొద్ది రోజుల్లోనే తను పరమపదించడం బాధాకరమని తన సేవలు తెలంగాణ ప్రజలు మరిచిపోలేరని తెలంగాణ అంటేనే ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది గాని ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించు కోవడానికి ప్రజలు ప్రొఫెసర్ జయశంకర్ చూపిన బాటలో పయ నించి బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్.ఐ) బషీర్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ లు యశ్వంత్, వనిత, నర్మద, జ్యోతి, రికార్డు అసిస్టెంట్లు సందీప్, రమేష్, సుధాకర్, కార్యాలయ సబర్డినేట్ దూగుంట్ల శ్రీనివాసరావు, ధరణి ఆపరేటర్ ప్రశాంత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.






# తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక జయశంకర్ సార్ జయంతి వేడుక

- గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీనివాసరావు గారు

ఫోకస్ న్యూస్ ప్రతినిధి( నారాయణఖేడ్ )-ఆగస్టు 6:

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిజాంపేట నందు తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ అజన్మ బ్రహ్మచారిగా పూర్తి జీవితాన్ని తెలంగాణ సాధన కోసం త్యాగం చేసిన మహెూన్నత శిఖరమని కొనియాడారు, వారి అడుగుజాడలో మనమందరం ఉన్నతమైన ఆశలతో చదువుకొని తెలంగాణను అభివృద్ధి పథాన ఉంచాలని విద్యార్థులకు సూచించారు. 1948లో తెలంగాణలో నిజాం పాలన అంతమై నిజాం పాలన అంతమై స్వతంత్ర పాలన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెలంగాణ వాసులను కాదని మద్రాస్ రాష్ట్రానికి చెందిన ఉద్యోగులను నియమించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ నాన్ ముల్కీ గో బ్యాక్ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా పాల్గొన్నారు. ఆ తదుపరి తొలి దశ తెలంగాణ ఉద్యమం, 2021 లో ప్రారంభమైన మలి దశ ఉద్యమం చివరిగా 2011 జూన్ 6న పరమపదించే వరకి వారి శ్వాస, ధ్యాస అంత కూడా తెలంగాణ కోసం కొనసాగిందని అన్నారు. కార్యక్రమంలో స్టేట్ టీచర్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్ సీనియర్ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, హరి ,దేవి సింగ్, నారాయణ,మారుతి, విజయ్ కుమార్ , రాంప్రసాద్, లక్ష్మణ్, సత్యనారాయణ శ్రీనివాస్ రెడ్డి, స్వతంత్రం, శ్రీవిద్య, విజయలక్ష్మి, భారతి, సురేఖ ,సుశీల, భ్రమరాంబిక, వెంకట్రామిరెడ్డి, నర్సింలు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## సిర్గాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు

(ఫోకస్ న్యూస్ ప్రతినిధి), సిర్గాపూర్-అగస్ట్ 06:

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ మల్సూర్ నాయక్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీడీఓ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళీ అర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఎపిఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.






## జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నారాయణఖేడ్ 4వ వార్డ్‌లో జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన గుఱ్ఱపు మచ్చేందర్ ఫౌండేషన్ చైర్మన్ గుఱ్ఱపు మచ్చేందర్..

ఫోకస్ న్యూస్ ప్రతినిధి, (నారాయణఖేడ్)-ఆగస్ట్ 6:

వారితో పాటుగా తెలంగాణ రాష్ట్ర ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, మాజీ వైస్ చైర్మన్ బాషిత్, నారాయణఖేడ్ మండల తాజా మాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్ నాయక్,నాగల్గిద్ద మండల తాజా మాజీ వైస్ ఎంపీపీ పండరి యాదవ్,నారాయణఖేడ్ మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నెమ్లిమెట్ సర్పంచ్ రెడ్డి, నారాయణఖేడ్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు రుద్రారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ ప్రభాకర్, ర్యాకల్ జిల్లా పరిషత్ పాఠశాల విద్య కమిటీ చైర్మెన్ విఠల్, నాయకులు పండరి, హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింలు, 4వ వార్డ్ అధ్యక్షులు శ్రీకాంత్, తదితరులున్నారు.



## ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు..

జనగం, ఫోకస్ న్యూస్ ప్రతినిధి సైదులు-ఆగస్టు 06:

దేవరుప్పుల మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో రాము మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అర్పించిన గొప్పవ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని,తెలంగాణ ఉద్యమానికి స్వరాష్ట్ర సాధనకు జయశంకర్ జీవితాన్ని అంకితం చేశారని,తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమంలో వివిధ రంగాల మేధావులను, ఉద్యోగ, వ్యాపారులను, విద్యార్థులను ఒక్క తాటిపైకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని,తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా పోరాటం సాగించిన జయశంకర్ సార్ సేవలను తెలంగాణ సమాజం సదా స్మరించుకుంటుందని,తెలంగాణ ప్రజలు ఏ విధంగా నష్టపోయారో గణాంకాలతో సహా ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలుగా సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, డిప్యూటి తహశీల్దార్ నవీన్ కుమార్, ఆర్ఐ లు రాజు, ఆంధ్రయ్య, జూనియర్ అసిస్టెంట్ లు భాగ్యలక్ష్మి, వెంకటేష్, రికార్డు అసిస్టెంట్ లు మంజుల, మహేందర్, అటెండర్లు యాకయ్య, అక్బర్, చంద్రయ్య, రేణుక ,కంప్యూటర్ ఆపరేషన్ అనురాగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్‌లపై పోలీసుల దౌర్జన్యం నశించాలి

తొర్రూరు(నేటి ఫోకస్ న్యూస్)ఆగస్టు 06:

సోమవారం జనగామలో అడ్వకేట్ లు అమృత రావు, కవిత లపై చట్ట విరుద్ధంగా జరిగిన పోలీసుల దాడి మరియు వారు ప్రదర్శించిన తీరును ఖండిస్తూ మంగళవారం తొర్రూరు బార్ అసోసియేషన్ న్యాయ వాదులు తమ కోర్టు విధులను బహిష్కరించి నిరసన నిరసన చేపట్టా రు. అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ ఇటీవల న్యాయవాదులపై కక్షి దారులు,పోలీసుల దాడులు పెరిగిపోతున్నాయని, భాదింపబడే వారి పక్షాన అహర్నిశలూ పోరాటం చేస్తున్న న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మంచి పరిణామం కాదని, దాడులను అరికట్టాలంటే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రవేశ పెట్టాలని,ఇప్పటివరకు జరిగిన సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ సిద్ధాంతకర్త డాక్టర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కలువకొలను ప్రవీణ్ రాజు, ప్రధాన కార్యదర్శి ఘనపురం రామకృష్ణ (ఆర్కె), కోశాధికారి సైదులు, న్యాయవాదులు బండపల్లి వెంకన్న, ప్రేమ్ చందర్, వల్లపు మహేష్, వేంకటేశ్వర స్వామి, పొడకంటి యాకాంబ్రం,వల్లపు మధుసూదన్, రఘురాంరెడ్డి, వల్లపు అయిలోని, లాలు, బొల్లం వెంకటేష్, ధరావత్ నగేష్, లింగాల శ్రీను, ఎల్లేష్, బి.వెంకటేశ్వర్లు, గంపల ప్రవీణ్, బొర్రా కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ మూవీకి 9న మూహూర్తం

జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం పాన్ ఇండియా ప్రాజెక్ట్ దేవరతో ఫుల్ బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటికే విడుదల చేసిన చుట్టమల్లె సాంగ్ నెట్టింటిని షేక్ చేస్తోంది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇదిలా ఉంటే తారక్ మరోవైపు ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో ఎన్టీఆర్ 31 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చాలా రోజుల తర్వాత తాజాగా ఈ భారీ సినిమాకు సంబంధించిన వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతూ అభిమానులను ఖుషీ చేస్తోంది. తారక్ ఎన్టీఆర్ 31 సినిమా లాంచింగ్‌కు ముహూర్తం ఖరారైంది. ఈ మూవీని ఆగస్టు 9న ఘనంగా ప్రారంభించేందుకు రెడీ అయ్యారు మేకర్స్. ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్‌కు డ్రాగన్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్టు ఇప్పటికే ఆన్‌లైన్‌లో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఇక ప్రశాంత్ నీల్ సలార్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడని తెలిసిందే. ప్రస్తుతానికి ఈ ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ సీక్వెల్ సలార్ 2పై ఫోకస్ పెట్టాడని ఇన్‌సైడ్ టాక్ నడుస్తోంది. తారక్ కూడా దేవర, వార్ 2 సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ రెండు సినిమాల షూటింగ్‌పై క్లారిటీ వచ్చిన తర్వాత ఎన్టీఆర్ 31 రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ పై స్పష్టత రానుందని తెలుస్తోంది.

# బాలయ్య సరసన ముగ్గురు హీరోయిన్లు..

స్టార్ హీరో బాలకృష్ణకు ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఆయన సినిమాల గురించి ఏ అప్‌డేట్స్ వచ్చినా అవి క్షణాల్లో వైరల్‌గా మారతాయి. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న బాలయ్య పేరు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఆయన సినిమాలకు సంబంధించిన కొన్ని వార్తలు తెగ షేర్ అవుతున్నాయి. బాలకృష్ణ -బాబీ కాంబినేషన్‌లో ఓ సినిమా (ఎన్‌బికె109) తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సంబంధించిన ఒక వార్త నెట్టింట సందడి చేస్తోంది. ఇందులో బాలకృష్ణ సరసన ముగ్గురు హీరోయిన్లు నటించనున్నట్లు తెలుస్తోంది. ఊర్వశీ రౌతేలా, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ ఇందులో కీలకపాత్రల్లో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. ఇదే నిజమైతే బాలయ్య సరసన ప్రగ్యాలను తెరపై రెండోసారి చూడొచ్చని అభిమానులు అనుకుంటున్నారు. ఇందులో బాబీదేవోల్ విలన్‌గా కనిపించ నున్నారు. మాస్ యాక్షన్ కథాంశంతో రూపొందుతోన్న ఈ సినిమాలో బాలయ్య రెండు కోణాలున్న పాత్రలో కనువిందు చేయనున్నట్లు తెలుస్తోంది. చాలా సంవత్సరాల తర్వాత ఆయన క్లాసీ లుక్‌లో కనిపించనున్నారట. అలాగే దీనిలో పొలిటికల్ బ్యాక్ డ్రాప్ నేపథ్యం ఉంటుందని టాక్. ఈ ఏడాది సూపర్ హిట్‌ను సొంతం చేసుకున్న చిత్రాల్లో ఫహద్ ఫాజిల్ నటించిన 'ఆవేశం' ఒకటి. జీతూ మాధవన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంది. కేవలం రూ.30 కోట్లతో నిర్మించిన ఈ యాక్షన్ కామెడీ ఫిల్మ్ ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లు వసూలుచేసింది. ఇప్పుడీ చిత్రాన్ని బాలకృష్ణ రీమేక్ చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా హక్కులను కూడా టాలీవుడ్‌కు చెందిన ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ కొనుగోలు చేసినట్లు టాక్ వినిపిస్తోంది.
దీనికి సంబంధించిన అధికారిక సమాచారం త్వరలోనే రానున్నట్లు తెలుస్తోంది.







పవన్ కళ్యాణ్, రవితేజతో

# మల్టీస్టారర్..

## మనసులో మాట బయటపెట్టిన హరీశ్ శంకర్

సాధారణ కథకు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి తన టేకింగ్‌తో ప్రేక్షకులను అలరించే దర్శకుడు హరీశ్ శంకర్. రవితేజ కథానాయకుడిగా ఆయన దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్' .భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్ శంకర్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. మల్టీస్టారర్ తీయాల్సి వస్తే ఎవరితో తీస్తారని అడగ్గా, పవన్‌కల్యాణ్, రవితేజ తో చేస్తానని అన్నారు. ఈ ఇద్దరిలో ఏ ఒక్కరు తెరపై కనిపించినా మాస్ ప్రేక్షకులు విజిల్స్ హోరెత్తిస్తారు. అలాంటిది ఇద్దరు హీరోలు ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే, పూనకాల తో ఊగిపోవడం ఖాయం. ఈ విషయం సామాజిక మాధ్యమాల వేదికగానూ ట్రెండ్ అవుతుండటంతో ఓ ట్వీట్‌కు కూడా హరీశ్ రిప్లై ఇచ్చారు. 'చాలా మంది చాలాసార్లు అడిగారు. అది కార్యరూపం దాల్చాలని ఆశిద్దాం' అన్నారు. అలాగే, మహేశ్‌బాబు తోనూ ఒక సినిమా చేయాలని ఉందని అన్నారు. అది తన చిరకాల కోరిక అని అభిప్రాయపడ్డారు. అలాగే, కొన్ని సందర్భాల్లో దర్శకుడిగా తాను ఫెయిల్ అయి ఉండవచ్చు. కానీ, తన సినిమాల విషయంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఎప్పుడూ ఫెయిల్ కాలేదని హరీశ్ శంకర్ చెప్పుకొచ్చారు. ఇక 'మిస్టర్ బచ్చన్' విషయానికొస్తే, హిందీలో విజయవంతమైన 'రైడ్'కు రీమేక్‌గా దీన్ని తీసుకొస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పాటలు, ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. రవితేజ నటన, హరీశ్ శంకర్ టేకింగ్‌తో పాటు, భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాపై అంచాలను పెంచాయి.



